క్లుప్తంగా

కంచరానకు అవార్డు



కంచరాన భుజంగరావు

శ్రీకాకుళం కల్చరల్/ఎచ్చెర్ల: శ్రీకాకుళం నగరానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన 'నీటి గింజల పంట' రొట్టమాకు రేవు–2025 అవార్డుకు ఎంపికైంది. త్వరలోనే అవార్డు అందుకోనున్నట్లు భుజంగరావు ఆదివారం తెలిపారు. ఇదే రచనకు 2024లోనూ పల్లా జాతీయ కవితా పురస్కారం దక్కిందని పేర్కొన్నారు.

తంగివానిపేటలో వైద్య శిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఎచ్చెర్ల: జరజాం పంచాయతీ తంగివానిపేటలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు బమ్మిడి సూర్య, పప్పల వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎఫ్‌పీఐఎఫ్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రామ్మోహన్



రామ్మోహన్

జి.సిగడాం: ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్(ఏపీఎఫ్‌పీఐఎఫ్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా దవళపేటకు చెందిన పీవీఎస్ ఫౌండేషన్ చైర్మన్ పేడాడ రామ్మోహన్ ఎన్నికయ్యారు. ఈ నెల 17న విజయవాడలో జరిగిన నూతన కార్యవర్గంలో చోటుదక్కింది. ఈ సందర్భంగా ఆదివారం రామ్మోహన్ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో యువత ఉపాధికి కృషి చేస్తామన్నారు.

వంతెన లేక ఇక్కట్లు



వంతెన నిర్మాణం చేపట్టాల్సిన ప్రాంతం

జి.సిగడాం: ముషినివలస పంచాయతీ రౌతుపేట– ముషినివలస గ్రామాల మధ్య రామసాగర్ చెరువు గట్టుపై వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామానికి చెందిన చందక సతీష్, మహేశ్వరరావు, రమణ, లక్ష్మణరావు, ఈశ్వరరావు, నారాయణమ్మ, ఆదిలక్ష్మి కోరారు. వర్షాల సమయంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు.

రామ కౌండిన్యకు పురస్కారం



రామకౌండిన్య

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన నృత్య దర్శకుడు రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యుడు రామ కౌండిన్య కూచిపూడి నాట్యంలో ప్రింద్రాని–2025 పురస్కారానికి ఎంపికయ్యాడు. లాస్య ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏటా నృత్యంలో విశేష ప్రతిభ కనబరిచిన కళాకారులకు పురస్కారంతో సత్కరిస్తుంది. దీనిలో భాగంగా ఈ ఏడాది చెన్నైలో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధినేత రాజ్ చేతుల మీదుగా అవార్డును రామ కౌండిన్య అందుకున్నారు.

శ్రీహర్షితకు సత్కారం




సత్కారం అందుకుంటున్న శ్రీహర్షిత

శ్రీకాకుళం కల్చరల్: సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్, కూచిపూడి నిర్వహించిన కూచిపూడి పోటీల్లో గెలుపొందిన శ్రీఅభినయ నృత్య నికేతన్ విద్యార్థిని కుంబారు సింధు శ్రీహర్షితను అవార్డుతో సత్కరించారు. పద్మ భూషణ డాక్టర్ వెంపటి చినసత్యం జన్మదినోత్సవం పురస్కరించుకొని శనివారం కూచిపూడి గ్రామంలోని సిద్ధేంద్ర యోగి కళాపీఠంలో ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీహర్షిత నృత్య ప్రదర్శన చేసి అందరి మన్ననలు పొందారు.

నిఘానేత్రమే శ్రీరామరక్ష

- ఇళ్లు, వ్యాపార సంస్థలకు సీసీ కెమెరాలతో రక్షణ
- స్వచ్ఛందంగా ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్న పోలీసులు



శ్రీకాకుళం: చోరీలు, ప్రమాదాలు జరిగేటప్పుడు పోలీసు విచారణ సమయంలో సీసీ కెమెరాలు కీలకంగా మారుతున్నాయి. శ్రీకాకుళం నగరంలో శుక్రవారం జరిగిన వెండి చోరీకి సంబంధించి పోలీసులు క్లూను సంపాదించగలిగారు. సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన కొన్ని చిత్రాల ఆధారంగా దాదాపుగా నిందితుడు ఎవరన్న దానిపై ఓ అవగాహనకు వచ్చారు. ఇదే కాకుండా శనివారం ఉదయం డేఅండ్‌నైట్ కూడలిలో ఓ వృద్ధుడు బస్సు కింద పడి మృతిచెందిన ఘటనలోనూ సీసీ కెమెరాలో నమోదైన వీడియో కీలకంగా మారింది. జిల్లా వ్యాప్తంగా జరిగిన ఎన్నో చోరీలు, హత్యలు, ప్రమాదాలు సంబంధించిన నిందితులను నిఘానేత్రాలే పట్టించాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల మన ఇంటికి, విలువైన సామగ్రికి రక్షణ కలుగుతుంది.

స్వచ్ఛందంగా రావాలి..

పోలీస్ శాఖ నగరాలు, పట్టణాలు, గ్రామాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి ప్రతి ఇంటిని కాపాడే స్థాయిలో లేవు. ఈ కారణంగానే ప్రతి ఇంటికి, ప్రతి వ్యాపార సంస్థకు ఎవరికి వారే స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు అమర్చుకోవాలని పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, ఇళ్ల వద్ద కూడా సీసీ కెమెరాలు అవసరాన్ని పోలీసులు తెలియజేస్తున్నా ఇంకా పూర్తిస్థాయిలో చైతన్యం రావడం లేదు. ఇళ్లు, ప్లాట్ల కొనుగోలుకు, వ్యాపార సంస్థల ఏర్పాటుకు లక్షల నుంచి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్న ప్రజలు రూ.10 వేలు నుంచి రూ.15 వేలు వెచ్చించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్న శ్రద్ధ చూపడం లేదు. ఈ కారణంగానే నిందితులు రెచ్చిపోతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా తమ సెల్‌ఫోన్‌లోనే ఇళ్లను ఎప్పటికప్పుడు పరిశీలించుకునే సౌలభ్యం ఉంటుంది. దీనికి అదనంగా అలారం కూడా ఏర్పాటు చేసుకుంటే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

అందుబాటు ధరల్లోనే..

మార్కెట్లో సీసీ కెమెరాలు అందుబాటు ధరల్లోనే లభ్యమవుతున్నాయి. సెక్యూరిటీ కెమెరాలకు వైర్ కనెక్షన్‌తో పాటు డేటా స్టోరేజ్ కోసం బాక్సు అమర్చుకోవాల్సి ఉంటుంది. అయితే ఇది కొంత ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. అదే వైఫై సెక్యూరిటీ కెమెరాలైతే రికార్డు చేసిన మొత్తం డేటా క్లౌడ్‌లో స్టోర్ చేస్తుంది. దీనిని మన మొబైల్ నుంచి నిర్వహించుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో రూ.800 నుంచి రూ.లక్ష రూపాయల వరకు సీసీ కెమెరాలు ఉన్నాయి. ఇళ్లకైతే వెయ్యి నుంచి పదివేల రూపాయల వరకు వెచ్చిస్తే సరిపోతుంది. వ్యాపార సంస్థల్లో స్థాయిని బట్టి స్టోరేజ్ అవసరాన్ని బట్టి రూ.50 వేలు వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒకసారి పెట్టుబడి పెడితే తిరిగి నిర్వహణ వ్యయం ఉండదు. అత్యధిక కెమెరాల్లో మాటలు సైతం రికార్డవుతాయి. ప్రజలు ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు అమర్చడం ద్వారా తమని తాము రక్షించుకోవడంతోపాటు పోలీసులకు సహకరించేందుకు వీలు కలుగుతుందనడంలో సందేహం లేదు.

నేరాల నియంత్రణ..



ప్రతి ఇల్లు, అపార్ట్‌మెంట్, వ్యాపార సంస్థల్లో సీసీ కెమెరాలు అమర్చుకుంటే ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. అలారం ఏర్పాటు చేసుకుంటే స్వయం రక్షణ కల్పించడంతోపాటు పోలీస్ శాఖకు ఎంతో సహకరించిన వారవుతారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. అపరిచిత వ్యక్తులు ఇంట్లోకి చొరబడకుండా ఉండేందుకు అవకాశం ఉంటుంది.

– వివేకానంద, శ్రీకాకుళం డీఎస్పీ

సీఎస్ఆర్ నిధులతో శ్వేత పుష్కరిణి అభివృద్ధి



కేంద్రమంత్రికి వివరాలు తెలియజేస్తున్న ప్రధానార్చకులు, తదితరులు

గార: శ్రీకూర్మంలోని కూర్మనాథాలయంలో శ్వేత పుష్కరిణి పరిసర ప్రాంత అభివృద్ధికి ఇండిగో ఎయిర్‌లైన్స్ సంస్థ సీఎస్ఆర్ కింద రూ.10 కోట్లు మంజూరయ్యాయని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. ఆదివారం శ్రీకూర్మనాథస్వామిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజులతో కలిసి దర్శించుకున్నారు. పుష్కరిణి పరిసర ప్రాంతాలను పరిశీలించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. పాడైన స్తంభాలు, విగ్రహాలతో పాటు కుడ్యచిత్రాల పరిరక్షణకు ఆలోచన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.నరసింహనాయుడు, ప్రధానార్చకులు చామర్ల సీతారామన్రసింహాచార్యులు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

నవంబర్ 16న శిష్టకరణాల పిక్నిక్

శ్రీకాకుళం కల్చరల్: శిష్ట కరణ బంధువుల వనభోజన మహోత్సవం నవంబర్ 16న నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు డబ్బీరు శ్రీనివాసరావు తెలిపారు. నగరంలోని శిష్టకరణ సామాజిక భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక భవనం ఆవరణలో పిక్నిక్ నిర్వహించడానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పట్టణ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు బలివాడ మల్లేశ్వరరావు, ఆర్థిక సలహాదారు ఎస్వీడీ మురళి, పట్టణ సంఘం ఉపాధ్యక్షుడు పెదపెంకి శ్రీరామ్ కుమార్, డి.వి.రమణమూర్తి, బలివాడ శివప్రసాద్, ఎన్.వి.కామేశ్వరరావు పట్నాయక్, డబ్బీరు వెంకటరావు, పి.నాగేశ్వరరావు, బలివాడ గోవిందరావు, పీవీఎస్ మధుసూదనరావు, నౌపాడ సుధాకర్, కె.శివప్రసాదరావు, బెహరా సతీష్ తదితరులు పాల్గొన్నారు

పేదల వైద్యానికి కూటమి తూట్లు



అదపాకలో కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద వైద్య విద్యార్థులతో పాటు పేద ప్రజలకు వైద్యం ఖరీదైపోతుందని వైఎస్సార్ కాంగ్రెస్ లావేరు మండల పార్టీ అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, ప్రత్యేక ఆహ్వానితుడు రొక్కం బాలకృష్ణ అన్నారు. లావేరు మండలం అదపాక, గుర్రాలపాలెం, కొత్తూరుపేట, పాతకుంకాం, కొత్తకుంకాం గ్రామాల్లో ఆదివారం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా ర్యాలీ నిర్వహించి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 17 మెడికల్ కాలేజీలను తీసుకొస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోవాలన్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంతో ఆనాడు మహానేత రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెడితే నేడు అనారోగ్యశ్రీగా మార్చేసి ప్రైవేటు ఆస్పత్రులకు బకాయిలు చెల్లించక పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి కార్యవర్గ సభ్యుడు గొర్లె అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, నాయకులు బొంతు సూర్యనారాయణ, వాల్లె దాలినాయుడు, షేక్‌చాంద్ బాషా, జనపాల భానోజీరావు, ఐ.వి.రమణ, గంట్యాడ సత్యం, నడిమింటి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మా పనైపోయింది బాబూ!

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర రహదారుల్లో కుళాయి పైపులైన్‌కు లీకులు ఏర్పడినప్పుడు మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ సిబ్బంది మరమ్మతులు చేశాక గోతులు సక్రమంగా పూడ్చడం లేదు. పని పూర్తయ్యాక పైపైన కప్పేసి మట్టి దిబ్బల్లా వదిలేస్తున్నారు. దీంతో వాహనచోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీకాకుళం పాతబస్టాండ్ నుంచి అరసవల్లికి వెళ్లే రోడ్డులో ఇలాగే పనిచేసి వదిలేశారు. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డు కూడా పెట్టకపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు.



అరసవల్లి రోడ్డు మధ్యలో మట్టి దిబ్బ

ఆదిత్యాలయానికి భక్తుల తాకిడి



లింగార్చన చేస్తున్న సాందీప్‌శర్మ



మూడు వెండి బిందెలను ఈవోకు అందజేస్తున్న దాతలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనాల విషయంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ చర్యలు చేపట్టారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అంతరాలయంలో స్వామి మూలవిరాట్టుకు ప్రత్యేక అలంకరణతో సర్వదర్శనాలకు అనుమతించారు. అనివెట్టి మండపంలో శివపంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్‌శర్మ జరిపించారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.79,500, విరాళాలు, ప్రత్యేక పూజల ద్వారా రూ.1,23,446, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,40 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లు ఈవో ప్రసాద్ తెలిపారు. కాగా, ఆలయంలో వినియోగానికి కేజీ 888 గ్రాముల వెండి బిందెలను బూర్జ గ్రామానికి చెందిన కేశవరావు, ఉమామహేశ్వరరావు, ఎం.వెంకటస్వామిలు వితరణగా అందజేశారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు



కోదండ రామాలయంలో అమ్మవారికి సువర్ణ పుష్పార్చన

శ్రీకాకుళం కల్చరల్: దీపావళి సందర్భంగా ఆదివారం మహాలక్ష్మీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పాలకొండ రోడ్డులోని కోదండ రామాలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని నోట్లతో అలంకరించారు. సువర్ణ పుష్పాలతో అష్టోత్తర పూజలు చేశారు. పీఎన్ కాలనీలోని వరసిద్ధి వినాయక పంచాయతన దేవాలయం వద్ద అష్టలక్ష్మీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అష్టోత్తర పుస్తకార్చన



మణినాగేశ్వర స్వామికి పుస్తకార్చన

శ్రీకాకుళం కల్చరల్: బలరామ ప్రతిష్ఠగా పూజలందుకుంటున్న కల్లేపల్లిలోని మణినాగేశ్వరుని సన్నిధిలో ఆదివారం అష్టోత్తర పుస్తకార్చన జరిగింది. కాశిని వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు స్వీయ రచనగా 'సంపూర్ణ వారణాసి యాత్ర' అనే 108 పుస్తకాలను విశ్వజయం గ్రూపు సభ్యుల శ్రేయస్సు కోసం స్వామికి సమర్పించారు. ఈ పుస్తకంలో కాశిఖండంలో వర్ణించిన 311 దివ్య దేవాలయాలు, దివ్య స్థలాలు, ఇతర 9 పుణ్యక్షేత్రాలను పొందుపరిచినట్లు వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి సూర్యనారాయణమూర్తి, పులఖండం సోమేశ్వరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడి కుటుంబానికి రూ.50 లక్షలు



కోమలను సత్కరిస్తున్న మాజీ సైనికులు

శ్రీకాకుళం కల్చరల్: లుకలాం గ్రామానికి చెందిన మాజీ సైనికుడు బొత్స శ్రీరాములు ఇటీవల చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతిచెందారు. ఎస్‌బీఐలో పెన్షన్ అకౌంట్ ఉండడంతో ప్రమాద బీమా కింద నరసన్నపేట ఎస్‌బీఐ బ్రాంచ్ ద్వారా శ్రీరాములు భార్యకు రూ.50లక్షలు పరిహారం వచ్చింది. ఈ నేపథ్యంలో ఎస్‌బీఐ అసోసియేట్ బి.కోమల, మేనేజర్ డి.మధుసూదనరావు, పూర్వపు మేనేజర్ సురేష్‌లను ఆదివారం జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు పూర్ణచంద్రరావు కటకం, విశ్రాంత గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వర రావు, గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సాఫ్ట్‌బాల్ సాధన



సాధన చేస్తున్న క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: త్వరలో జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి సీనియర్స్ సాఫ్ట్‌బాల్‌తోపాటు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి అండర్–14, 17, 19 విభాగాల్లో ఎంపికైన సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ క్రీడాకారులు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. శ్రీకాకుళంతోపాటు ఇప్పిలి, కేశవరావుపేట జెడ్పీహెచ్ స్కూళ్ల ప్రాంగణంలో వీరికి క్రీడాసాధనతోపాటు ఫిట్‌నెస్ పాఠాలు నేర్పిస్తున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా సాధన చేస్తూ రాటుదేలుతున్నారు. రాష్ట్రపోటీల్లో గెలుపే లక్ష్యంగా సాధన చేయిస్తున్నట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘ నిర్వాహకులు చెబుతున్నారు.

ఘనంగా మెహర్‌బాబా మందిర వార్షికోత్సవం



వార్షికోత్సవంలో బాబా భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెర వీధిలో అవతార్ మెహర్‌బాబా కేంద్రం 33వ వార్షికోత్సవం ఆదివారం వైభవోపేతంగా జరిగింది. వాహినీపతి కామేశ్వరరావు, కృష్ణంనాయుడు, మెహర్ సుధాకర్ హాజరై బాబా సందేశం వినిపించారు. మెహెర్‌బాబా కలియుగంలో మానవుడు చేసిన కర్మల సంస్కార భారాన్ని తొలగించి, ఆధ్యాత్మిక పురోగతి సాగిస్తూ తోటి వారిలో భగవంతుడు ఉన్నాడనే భావనతో ప్రేమమయ జీవనాన్ని సాగించే మార్గాన్ని సూచించి, ఆచరించి, ఆచరింపజేశారని వివరించారు. అనంతరం బరాటం నాగభూషణరావు సప్తవర్ణ పతాక ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, ఆనంద్‌కుమార్, యు.వి.రమణమూర్తి, ఈశ్వరరావు, మెహెర్ నారాయణ, ఉమా మహేశ్వరరావు, రంగప్రసాదరావు, వరప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, భాస్కరరావు, మెహెర్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకాశం.. ఆహ్లాదకరం..!



ఆకాశం మేఘావృతమై కనువిందు చేసింది. ఆదివారం మధ్యాహ్నం టిడివలస–పాలఖండ్యాం గ్రామాల మధ్య నల్లటి మేఘాలు కమ్ముకుని వాతావరణం ఆహ్లాదకరంగా కనిపించింది. – జి.సిగడాం